సాక్షి తిరుపతి

బుధవారం ׀ 12 ׀ జూలై ׀ 2023



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

రాపూరు మండలం, తెగచర్ల చెరువు వద్ద మూడు ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



మహిళ గల్లంతు

ఓ మహిళ తెలుగుగంగ కాలువలో దిగి గల్లంతయిన ఘటన వెంకటగిరి రూరల్ మండలం, కలపాడులో చోటుచేసుకుంది. - 8లో



వేడుకగా సామూహిక భజనలు

టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజన మండళ్ల సామూహిక భజనలు వేడుకగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 64,347 మంది స్వామివారిని దర్శించుకోగా.. 28,358 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.11 కోట్లు సమర్పించారు. అయితే మూడు నెలలు తర్వాత రికార్డ్ స్థాయిలో శ్రీవారి హుండీ ఆదాయం రావడం ఇదే ప్రథమం. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

19 నుంచి 22వ బ్యాచ్‌కి శిక్షణ

తిరుపతి అర్బన్: తిరుపతి అలిపిరి ఆర్టీసీ డిపోలో ఈనెల 19వ తేదీన 22వ బ్యాచ్‌కి శిక్షణ ప్రారంభం కానున్నట్టు డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్, డిపో మేనేజర్ ఎస్.హరిబాబు తెలిపారు. 17వ తేదీకి 21వ బ్యాచ్‌కి శిక్షణ పూర్తవుతుందని, ఆ మేరకు వారికి వీడ్కోలు పలకనున్నట్టు వెల్లడించారు. మరోవైపు 20వ తేదీ నుంచి 23వ బ్యాచ్‌కి శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అలిపిరి డిపో నుంచి 100 విద్యుత్ బస్సులను ఆపరేటింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

జనాభా పెరుగుదలతో సమస్యలు



విజేతలకు బహుమతి అందజేస్తున్న సెట్విన్ సీఈఓ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జనాభా పెరుగుదలతో అన్ని రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని సెట్విన్ సీఈఓ డాక్టర్ వి.మురళీకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్వీయూలోని జనాభా అధ్యయన విభాగంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ జనాభాలో రెండో స్థానంలో ఉన్న భారత్ నేడు మొదటి స్థానానికి చేరుకుందన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఎస్ఆర్.మూర్తి మాట్లాడుతూ వృద్ధాప్య జనాభా పెరుగుతోందే తప్ప యువత జనాభా పెరగడం లేదనిన్నారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల పాపులేషన్ విభాగాధిపతి సుజాత, జనాభా విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ టి.చంద్రశేఖరయ్య, సెట్విన్ మేనేజర్ మోహన్‌కృష్ణ, రిటైర్డ్ బ్యాంకు మేనేజరు డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సమాన అవకాశాలతో అభివృద్ధి

తిరుపతి ఎడ్యుకేషన్ : మహిళలు, బాలికలకు సమాన అవకాశాలు ఉన్నప్పుడే వారి కుటుంబాలు, సమాజ, ఆర్థిక వ్యవస్థల అభ్యున్నతికి మరింతగా తోడ్పడి ఆరోగ్యవంతమైన సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీ.భారతి తెలిపారు. ఎన్ఎస్ఎస్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలో నిర్వహించిన ప్రపంచ పాపులేషన్ డేకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధిక జనాభా వల్ల సహజ వనరుల కొరత ఏర్పడడంతో పాటు జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తుందన్నారు.

నిరసన జ్వాల

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వలంటీర్లు తీవ్రంగా ఖండించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలకు దిగారు. పవన్ ఫ్లెక్సీలకు చెప్పుల దండ వేసి ఊరేగించారు. మరికొన్ని ప్రాంతాల్లో పవన్ దిష్టిబొమ్మకు పాడికట్టి ఊరేగించారు. ఆపై ప్రధాన కూడళ్లలో పెట్రోల్ పోసి తగలబెట్టారు. జీవితంలో ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగిందన్న ఆనందంలో ఉన్న తమను కించపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ఆరోపణలు చేసిన పవన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- పవన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న వలంటీర్లు
- జిల్లా వ్యాప్తంగా నిరసనల హోరు
- నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరిక
- భేషరత్‌గా క్షమాపణ చెప్పాలని డిమాండ్



నాయుడుపేటలో పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

> **ప్యాకేజీ స్టార్ నోరు అదుపులో పెట్టుకో**
>
> 
>
> ఏ పార్టీకి మద్దతు ఇస్తే ఆ పార్టీ దగ్గర వందల కోట్లు ప్యాకేజీ తీసుకునే ప్యాకేజీ స్టార్ పవన్‌కల్యాణ్ వలంటీర్ల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకో. ప్రజాసేవ అంటే ఏమిటో తెలుసుకో. ప్రజలకు మేలు చేసి తన రాజకీయ నాయకత్వాన్ని నిరూపించుకోవాలే తప్ప ప్రజాసేవకులైన తమ లాంటి వలంటీర్లపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు.
>
> – సరస్వతి, వలంటీర్
>
> **బాధాకరం**
>
> 
>
> ఇదివరకు సినీ హీరోగా పవన్‌కల్యాణ్ అంటే ఎంతో అభిమానం. అయితే రాజకీయ లబ్ధి కోసం నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై సభ్యసమాజమే సిగ్గుతో తలదించుకునేలా దూషించడం చాలా బాధాకరం.
>
> – శ్రీనివాసులు, వలంటీర్

పవన్‌పై పోలీసులకు ఫిర్యాదు



ఓజిలిలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

ఓజిలి: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై వలంటీర్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఓజిలి బస్టాండ్ సెంటర్‌లో నిరసనవ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమను కించపరుస్తూ పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. సేవా భావంతో పనిచేస్తున్న వలంటీర్లపై పవన్ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్, సంక్షేమ పథకాలు అందిస్తున్న తమపై నిందలేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల అరాచకాలు, చంద్రబాబు 600 హామీలపై పవన్ ఎందుకు ప్రశ్నించలేదని మండిపడ్డారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

అభిమానం..అసహ్యం!



తిరుపతిలో పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలను దహనం చేస్తున్న వలంటీర్లు

తిరుపతి మంగళం: ఇదివరకు పవన్ కల్యాణ్ అంటే సినీ హీరోగా అభిమానం ఉండేది. ఇప్పుడు ప్యాకేజీ స్టార్ అయిపోయారు. నిత్యం ప్రజాసేవకే అంకితమైన వలంటీర్లను అమ్మాయిలను తరలించే ముఠాతో పోల్చుతూ నీచంగా మాట్లాడారు. ఆయనంటేనే అసహ్యమేస్తోంది' అని పలువురు వలంటీర్లు ధ్వజమెత్తారు. తిరుపతి నగరంలోని 3, 6, 7 డివిజన్ల వలంటీర్లు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పవన్ ఫ్లెక్సీకి చెప్పుల దండ వేసి దహనం చేశారు. ప్యాకేజీ స్టార్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న సైనికులమని చెప్పుకోవడానికే ఎంతో గర్వపడుతున్నామని తెలిపారు. పవన్‌కల్యాణ్ తన రాజకీయ లబ్ధికోసం, ప్యాకేజీ కోసం వలంటీర్లను నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

క్షమాపణ చెప్పాల్సిందే

వరదయ్యపాళెం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వరదయ్యపాళెం మండల కేంద్రంలో జేసీఎస్ కన్వీనర్ చిన్న ఆధ్వర్యంలో శవయాత్ర చేసి గ్రామ వీధుల్లో ఊరేగించి దహన సంస్కారాలు నిర్వహించారు. అనంతరం పవన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వరదయ్యపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ ఓర్వలేక దత్తపుత్రుడు, ఆయన తండ్రి చంద్రబాబు పిచ్చికూతలు కూయడం విడ్డూరమన్నారు. వలంటీర్ అక్కచెల్లెమ్మను విమర్శించడం వారి స్థాయికి తగదన్నారు. విమర్శలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర రెడ్డి, జేసీఎస్ కనీవనర్ చిన్న, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, ఎస్సీసెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్, కార్యదర్శి లతీఫ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రహ్మణ్యంరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రమణయ్య సిద్ధిక్ పాల్గొన్నారు.



వరదయ్యపాళెంలో పవన్ కల్యాణ్‌కు శవయాత్ర నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్లు, నేతలు



పవన్‌పై కేసు నమోదు చేయాలని వరదయ్యపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

మా జోలికొస్తే ఊరుకోం

కోట: పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వలంటీర్లు తీవ్రంగా ఖండించారు. తమజోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. కోటలో పలువురు వలంటీర్లు పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను తగలబెట్టారు. అనంతరం ఎంపీడీఓ భవానీకి వలంటీర్లు వినతి పత్రం అందజేశారు. తమ జోలికొస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, నేదురుమల్లి హరిప్రసాద్‌రెడ్డి, చేవూరు నాగేశ్వరరావు, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య వలంటీర్లకు మద్దతుగా నిలిచారు.



నోరు అదుపులో పెట్టుకో



నాయుడుపేట టౌన్: పవన్ నోరు అదుపులో పెట్టుకో.. అంటూ పలువురు వలంటీర్లు హెచ్చరించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి వలంటీర్లు ర్యాలీ చేపట్టారు. పట్టణంలో పోలీస్‌స్టేషన్ మీదుగా దర్గావీధి నుంచి నేరుగా పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నివాళి అర్పించారు. తర్వాత పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అసత్య ఆరోపణలు చేసిన పవన్‌పై కేసు నమోదు చేయాలని ఎస్ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. 13 సచివాలయ వలంటీర్లు, స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య, నాయకులు అన్నమేటి చంద్రారెడ్డి, పేర్నాటి రాహుల్, కావేరిపాకం భాను ప్రసాద్, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ రహంతూల్లా తదితరులు పాల్గొన్నారు.

పవన్ దిష్టిబొమ్మ దహనం



రేణిగుంట: అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ వలంటీర్లు స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పవన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎన్టీఆర్ కూడలి నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన రాష్ట్రంలోని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



తిరుపతిలో ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు



కొర్లగుంట వద్ద వలంటీర్ల మానవహారం

సేవా సైన్యం

తిరుపతి తుడా: దేశంలో ఎక్కడాలేని విధంగా వలంటీర్ వ్యవస్థ ఏపీలో కొనసాగుతోంది. ప్రతి పథకం లబ్ధిదారుకు చేరాలనే ఉద్దేశంతో ఈ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఆయన ఆశయానికి అనుగుణంగా విశిష్టసేవలందిస్తూ మన్ననలందుకుంటున్నారు. ఇలాంటి సేవకులపై కొందరు అవగాహన లేనివారు విమర్శలు చేయడాన్ని వలంటీర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో వచ్చి పరిశీలించాలని హితవు పలుకుతున్నారు.



ఈమె పేరు సుమలత. పాకాల మండలంలోని చెన్నుగారిపల్లి పంచాయతీ, మణిపిరెడ్డిపల్లి దళితవాడ వలంటీర్. ఈమె పర్యవేక్షణలో 50 నివాసాలు ఉన్నాయి. కరోనా వచ్చిన సమయంలో తమ పరిధిలోని వారికి సూచనలు ఇవ్వడంతో పాటు కూరగాయలు తెచ్చి ఇచ్చింది. గ్యాస్ ఇవ్వడం, మందులు తెచ్చి ఇవ్వడం వంటి పనులు చేసిపెట్టింది. కరోనా బారిన పడిన వారు ఎలాంటి మానసిక ఆందోళన చెందకుండా వారిలో మనోధైర్యాన్ని నింపింది. దీనిపై స్థానికులు ఇప్పటికీ ఆమెను తమ కుటుంబ సభ్యురాలుగానే గౌరవిస్తున్నారు.



తిరుపతి నగరంలోని ఎనిమిదో డివిజన్ పరిధిలో కొంతమంది వలంటీర్లు సేవా మూర్తులుగా నిలిచారు. లాక్ డౌన్ కారణంగా ఇళ్లల్లో నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో వలంటీర్లు హేమవతి, లావణ్య, అబ్దుల్ రెహమాన్, దుర్గాంజలి, దివ్య, వార్డ్ ఆఫీసర్ సూరిబాబు సహకారంతో సొంత నిధులతో నిత్యావసర సరుకులను కొనుగోలు చేసి పంపిణీ చేశారు. డివిజన్లోని ఎంపిక చేసిన పేద ప్రజలకు వాటిని పంచిపెట్టారు. కరోనా సమయంలో వలంటీర్లు కుటుంబ సభ్యులకంటే ఎక్కువగా చూసుకున్నారని నిత్యావసర సరుకులు అందుకున్న ఉమ తెలిపారు. వారి సేవా గుణానికి సలాం చేస్తున్నట్టు ఆనందం వ్యక్తం చేశారు.



తిరుపతి 8వ డివిజన్‌లో వలంటీర్ సహాయంతో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం (ఫైల్)

> **అన్నీ సమకూర్చింది**
>
> మా ఇంట్లో ఒకే సారి ఇద్దరికి కరోనా వచ్చింది. ఆ సమయంలో వలంటీర్ సుమలత మాకు మంచి సేవలు అందించింది. రోజూ ఏమికావాలో అడిగి తెలుసుకునేది. క్వారంటైన్‌లో ఉండేటప్పుడు మా కుటుంబ సభ్యులకు కావల్సిన అన్ని వసతులను ఆమే సమకూర్చింది. వలంటీర్ వ్యవస్థకు రుణపడి ఉంటాం. జై జగన్.
>
> పి.కళ్యాణ్‌కుమార్, చెన్నుగారిపల్లి పంచాయతీ, పాకాల మండలం



బంగారు కడియం అప్పగింత


బాధితురాలికి బంగారు కడియాన్ని అంద జేస్తున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: బంగారు కడియాన్ని దారపోసుకున్న భక్తురాలికి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మంగళవారం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన భక్తులు క్యూలో సుమారు 12 గ్రాముల బంగారు చేతి కడియాన్ని దారపోసుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు అందజేశారు. ఆయన భక్తులను గుర్తించి అందజేశారు.

టైపు రైటింగ్ పరీక్షలు

తిరుపతి కల్చరల్: ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విజయవాడ వారు నిర్వహించే టైపు రైటింగ్ పరీక్షలు సెప్టెంబర్ 2, 3 తేదీలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ తిరుపతి అధ్యక్షుడు కిరణ్ తెలిపారు. ఆగస్టు 26న తెలుగు షార్ట్ హ్యాండ్, 27న ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్ పరీక్షలు ఉంటాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు కలిగిన టైప్ ఇన్‌స్టిట్యూట్‌లలో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధికి దిక్సూచి జగనన్న


దుర్గసముద్రంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలుకుతున్న మహిళలు


చంద్రగిరిలో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో మోహిత్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి

- జగనన్న సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకం
- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల అమలే లక్ష్యం
- అభివృద్ధి జరిగిందని నమ్మితేనే ఆశీర్వదించండి
- మీ బిడ్డగా మీకు అందుబాటులో ఉంటా.. ఆదరించండి
- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల మండలాల్లో లబ్ధిదారులకు 4,114 సర్టిఫికెట్ల జారీ

తిరుపతి రూరల్: దేశంలోనే అభివృద్ధికి దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకమని, అర్హత కలిగి ఏదేని సాంకేతిక, ఇతర కారణాలతో ప్రభుత్వ పథకం పొందలేని లబ్ధిదారులకు వాటిని గడపగడపకు చేర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమన్నారు. మంగళవారం తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల మండలాల పరిధిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం విజయవంతంగా సాగింది. తిరుపతి రూరల్ మండలంలో 3,151, చంద్రగిరి మండలంలో 866, పాకాల మండలంలో 974 మొత్తం 4,114 సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను మోహిత్ రెడ్డి స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు.

అభివృద్ధిలో అగ్రస్థానం

దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాల అమలులో ఏపీ అగ్రస్థానంలో నిలుస్తోందని, జగనన్న సురక్ష కార్యక్రమం సర్టిఫికెట్ల జారీ కోసం మాత్రమే కాదు.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల అమలు కోసం ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. అమ్మఒడి, చేయూత, ఈబీసీ, రైతు భరోసా వంటి తదితర పథకాల అమలు, ప్రజాసంక్షేమ అభివృద్ధికి సీఎం జగనన్న దిక్సూచిగా నిలుస్తున్నారన్నారు. అందరికీ విద్య అందించాలనే సంకల్పంతో నాడు – నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు ఆదాయం చేకూరుతోందన్నారు. గతంలో రూ.1.5 లక్షలుగా ఉన్న తలసరి ఆదాయం నేడు రూ.2.25 లక్షలకు పెరిగిందన్నారు. రైతు ప్రయోజనాల కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. గ్రామ స్థాయిలో వలంటీర్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందని కితాబిచ్చారు. తనను నమ్ముకున్న ప్రజల కోసం నిరంతరంగా పరితపించే ప్రజా నాయకుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తానని, కుటుంబ సభ్యుడిగా అండగా ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. సీఎం జగనన్న పిలుపు మేరకు అభివృద్ధి జరిగిందని నమ్మితేనే ఆశీర్వదించండని మోహిత్‌రెడ్డి ప్రజలను కోరారు. కార్యక్రమంలో అధికారులు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,730
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,454
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,100
రిటైల్ వెండి గ్రాము	రూ.75.10

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పెళ్లకూరు: మండలంలోని ఎగువతాగేలి గ్రామానికి చెందిన ఎడిచర్ల చంద్రబాబు(30) సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. చంద్రబాబు కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా.. స్థానికులు గుర్తించి హుటాహుటిన శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ చంద్రబాబు మంగళవారం మృతిచెందారు. మృతునికి భార్య భారతి, కుమారుడు శశికుమార్, కుమార్తె సౌమ్య ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, ముద్దాయిలతో అటవీశాఖ అధికారులు

రాపూరు: నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, తెగచర్ల గ్రామ చెరువు వద్ద అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న మూడు ఎర్రచందనం దుంగలు, కారును టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి కారకులైన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు రాపూరు అటవీ రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుపతికి చెందిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, గోనుపల్లి అటవీశాఖ, బేస్ క్యాంప్ సిబ్బంది సోమవారం రాత్రి పెంచలకోన అడవుల్లో కూంబింగ్ నిర్వహించగా.. వైఎస్సార్ జిల్లా చిట్వేలి అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికినట్లు గుర్తించి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జాతీయ రహదారికి సమాపంలోని రాపూరు మండలం, తెగచర్ల గ్రామ చెరువు వద్ద ఉన్న కారును గుర్తించి అక్కడే కాపు కాయగా అడవుల్లో నుంచి ముగ్గురు వ్యక్తులు మూడు ఎర్రచందనం దుంగలతో కారువద్దకు రావడంతో సిబ్బంది మూకుమ్మడిగా వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న వంటసామగ్రితో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ముగ్గురూ తమిళనాడు రాష్ట్రం, శీలం కు చెందిన వారిగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్టు వివరించారు. కూంబింగ్‌లో తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఆర్‌ఎస్‌ఐ వినోద్‌కుమార్, గోనుపల్లి డీఆర్వో మస్తానయ్య, సిబ్బంది ఫరీద్, ప్రవీణ్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు లేని కళాశాలలపై కఠిన చర్యలు


ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఏపీ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి

తిరుపతి ఎడ్యుకేషన్: గుర్తింపులేని ప్రయివేటు కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) జీవీ.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన మంగళవారం తిరుపతిలోని ఆర్ఐఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత లక్ష్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, అందుకు అనుగుణంగా ప్రతిఒక్కరూ తమ బాధ్యతలను నిర్వర్తించాలని కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు బోర్డు నిబంధనలు అనుసరించి పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రైవేట్ కళాశాలలో చేరే ప్రతి విద్యార్థి వివరాలను ఏ రోజుకు ఆ రోజు ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన ఫీజులనే వసూలు చేయాలని, అధిక ఫీజులు వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు గుర్తింపు రద్దుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. అంతకు ముందు ఆర్ఐఓగా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్ రెడ్డిని ఏపీ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.రవి, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు రాజనాల, వంశీకృష్ణ, హేమలత, కిశోర్ తదితరులు ఘనంగా సత్కరించారు.

నేడు జిల్లాకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి

తిరుపతి అర్బన్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి జిల్లా పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. మంగళ, బుధవారాల్లో మంత్రి పర్యటించనున్న ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. బుధవారం సాయంత్రం 4.15 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారని, 4.45కు కొత్తపాళెం సమీపంలోని జాతీయ రహదారి వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. రాత్రి 7.15 గంటలకు తిరుపతిలోని తాజ్ హోటల్ వద్ద ఎలక్ట్రికల్ బస్సు (ప్రైవేటు బస్సు) ప్రారంభోత్సవం, రాత్రి తిరుమలలో బస, గురువారం ఉదయం శ్రీవారి సేవలో పాల్గొంటారని, 10.15 గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనం, 11.10గంటలకు ఎస్వీ యూనివర్సిటీ స్టేడియం వద్ద పలు నూతన జాతీయ రహదారులను జాతికి అంకితం చేసే కార్యక్రమం, బహిరంగ సభ, తర్వాత 12.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో అన్నమయ్య జిల్లా నక్కలదిన్నె వద్ద స్వస్తి ఆస్పత్రి ప్రారంభించి తిరిగి 4.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని నాగపూర్‌కు తిరుగు ప్రయాణమవుతారని తెలిపారు. ఆయన వెంట కార్యక్రమంలో డీఆర్వో కోదండరామిరెడ్డి, అడిషనల్ ఎస్పీ పి.వెంకట్రావు, తిరుపతి నగరపాలక కమిషనర్ హరిత, జాతీయ రహదారుల పీడీలు వెంకటేశ్వర్లు, దేవేష్ గోయల్, కార్తీక్, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవో కనకనరసారెడ్డి, రామారావు పాల్గొన్నారు.

వేడుకగా సామూహిక భజనలు


భజన మండళ్ల సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ సదాభార్గవి


సామూహిక సంకీర్తన భజనల్లో పాల్గొన్న భజన మండళ్ల సభ్యులు

తిరుపతి కల్చరల్: టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం భజన మండళ్ల సామూహిక భజనలు వేడుకగా నిర్వహించారు. శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం మూడో సత్రం ప్రాంగణంలో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంకీర్తనాలాపన, ధార్మిక సందేశం అందించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రలకు చెందిన సుమారు 3,500 మందికిపైగా భజన మండళ్ల సభ్యులు హరినామ సంకీర్తనల భజనలు చేస్తూ తమ ఆధ్యాత్మికత భావాలను చాటుకున్నారు.


నేడు మెట్ల పూజ

చివరి రోజైన బుధవారం అలిపిరి పాదాల మండపం వద్ద మెట్ల పూజ చేయనున్నారు. ఈమేరకు భజన మండళ్ల సభ్యులు మూడో సంత్రం నుంచి అలిపిరి పాదాల మండపానికి చేరుకొని మెట్ల పూజలో పాల్గొని భజనలు నిర్వహిస్తారు. అనంతరం సప్తగిరులను అధిరోహించి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

విశ్వాసంతోనే విజయం


భగవంతుడిపై పరిపూర్ణ విశ్వాసం ఉంచి పనులు మొదలుపెడితే తప్పక సఫలీకృతమవుతుందని టీటీడీ జేఈవో సదాభార్గవి తెలిపారు. రాత్రి జరిగిన భజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

మున్సిపాలిటీలలో రీ-ఆడిట్ విధానం


సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రకాష్

శ్రీకాళహస్తి: ఆర్థిక స్వావలంబన కోసమే జీఓ నం.74ను ప్రభుత్వం విడుదల చేసిందని స్టేట్ ఆడిట్ విభాగం డైరెక్టర్ హరిప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక పురపాలక ఆడిట్ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న 123 మున్సిపాలిటీల్లో ఆర్థిక స్థితిగతులు పరిశీలించడానికి రీ ఆడిట్ విధానాన్ని పరిచయం చేయడానికి ప్రతి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వీటికి సంబంధించి చివరి సమావేశం ఇదేనన్నారు. పోస్టు ఆడిట్ విధానంలో జరుగుతున్న లోపాలు సరిదిద్దేందుకు రీ-ఆడిట్ విధానాన్ని ఆన్‌లైన్‌లో తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందని, ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా మున్సిపాలిటీలు, పంచాయతీలలో అమలు చేయాలని సంకల్పిస్తున్నట్టు వెల్లడించారు. గతంలో ఎండోమెంట్ శాఖలో ఈ విధానాన్ని పాటించి పురోగతి సాధించామన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, నాయుడుపేట, రాజంపేట కమిషనర్లు బాలాజీనాయక్, నరేంద్రబాబు, వెంకటరామారావు, శ్రీనివాసరావు, జనార్దన్‌రెడ్డి, పురపాలక అధికారులు, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ కాలువలో దూకి మహిళ గల్లంతు


గల్లంతైన మహేశ్వరి (ఫైల్)

వెంకటగిరిరూరల్: 'హలో..ఏమండీ వంటగది డబ్బా కింద రూ.1,700 డబ్బులు పెట్టాను. తీసుకోండి.. మీరు, పిల్లలు జాగ్రత్త.. నేను తెలుగుగంగ కాలువ దగ్గర ఉన్నా' అంటూ ఓ మహిళ తన భర్తతో ఫోన్‌లో మాట్లాడి తెలుగుగంగ కాలువలో దిగి గల్లంతయింది. ఈ ఘటన వెంకటగిరి రూరల్ మండలం, కలపాడు గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఆమె భర్త కథనం.. డక్కిలి మండలం, ఎగువ లింగసముద్రం గ్రామానికి చెందిన వేముల మహేశ్వరి (38), ఆమె భర్త తిరుపాలయ్య, కుమారులు పవన్, కార్తీక్‌తో కలిసి వెంకటగిరి పట్టణంలోని రాణిపేటలో జీవనం సాగిస్తున్నారు. మహేశ్వరి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన కాళ్లకు ఉన్న పట్టీలు తీసి ఇంట్లోనే పెట్టి పర్సు తీసుకుని రాపూరుకు వెళ్లే బస్సు ఎక్కి డక్కిలి మండలం పలుగోడుకు టికెట్ తీసుకుంది. అయితే కలపాడు తెలుగుగంగ కాలువ వద్దకు వచ్చేసరికే మహేశ్వరి బస్సు దిగేసి కలపాడు గ్రామం వైపుగా కట్టమీద నడుచుకుంటూ వెళ్లింది. తన భార్య ఇంట్లో లేదని తెలుసుకున్న భర్త తిరుపాలయ్య మహేశ్వరికి పలుసార్లు ఫోన్ చేయగా మహేశ్వరి తిరిగి భర్తకు ఫోన్‌చేసి ''ఏమండీ ఇంట్లో వంటగది డబ్బాల కింద రూ.1,700 నగదు ఉంది. అవి తీసుకోండి.. పిల్లలు, మీరు జాగ్రత్తగా ఉండండి'' అంటూ ఫోన్ మాట్లాడింది. కంగారు పడిన భర్త తిరుపాలయ్య మహేశ్వరిని గట్టిగా ప్రశ్నించగా కలపాడు వద్ద తెలుగుగంగ కాలువలో దూకి చనిపోతున్నట్లు తెలిపింది. దీంతో తిరుపాలయ్య కుటుంబ సభ్యులతో హుటాహుటిన ఘటన స్థలం వద్దకు చేరుకున్నాడు. తెలుగుగంగ కాలువ ఒడ్డుపై తన భార్య పర్సు, చెప్పులు వదిలేసి కాలువలోకి జారినట్లు ఆనవాళ్లు గుర్తించాడు. ఆమేరకు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించాడు. మహేశ్వరి కోసం తెలుగుగంగ కాలువలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. మహేశ్వరి కాలువలో గల్లంతవడానికి అప్పులు, ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది.